సర్కారు బడి.. సమస్యల ఒడి

ప్రహరీలు కరువు.. అసాంఘిక కార్యకలాపాలకు నెలవు





నారాయణఖేడ్ మండలంలోని ఓ పాఠశాల ఆవరణలో దుస్థితి

నారాయణఖేడ్: సర్కారు బడులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రహరీలు లేక అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులకు మద్యం బాటిళ్లు, సిగరెట్ పీకలు, తిను బండారాలు దర్శనమిస్తున్నాయి. ఆవరణలో నాటిన మొక్కలను పశువులు ధ్వంసం చేయడంతో పాటు అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. ఈ ఘటనలు పిల్లలపై ప్రభావం చూపుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఇలాంటి పరిస్థితే నెలకొంది.

నారాయణఖేడ్ నియోజకవర్గంలో 176 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇంతే సంఖ్యలో గిరిజన తండాలు ఉన్నాయి. మొత్తం 394 పాఠశాలలు ఉండగా అందులో 276 పాఠశాలలకు ప్రహరీలు కరువయ్యాయి. చాలా పాఠశాలల్లో చోరీలు సైతం జరిగాయి. రాత్రివేళల్లో పాఠశాలల తలుపులు ధ్వంసం చేసిన సంఘటనలు ఉన్నాయి. గ్రామాలకు దూరంగా ఉండడంతో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. పురాతన భవనాలు ఉండడంతో వర్షాలకు లికేజీలు ఏర్పడి కురుస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని విద్యకు అవసరమైన పరికాల కొనుగోలు, సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

గ్రామస్తులు చూడాలి



రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గ్రామస్తులు చూడాలి. మన ఊరు– మన బడి కింద మొదటి విడతలో కొన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు జరుగుతున్నాయి. విడతల వారీగా అన్ని పాఠశాలల్లోనూ కల్పిస్తాం.

– విశ్వనాథ్, ఎంఈఓ, నారాయణఖేడ్

అభివృద్ధి, సంక్షేమం చూసే బీఆర్‌ఎస్‌లోకి..

- హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్



పార్టీలో చేరిన వారితో చింతా ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: అభివృద్ధి, సంక్షేమం చూసే ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణ 2వ వార్డు మాజీ కౌన్సిలర్ శ్రీరామ్ వెంకట్‌తో పాటు 50 కార్యకర్తలు బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం సంగారెడ్డి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కసాలరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీపీ సరళ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



హత్నూర: నస్తీపూర్‌లోని పొలంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



సదాశివపేట పట్టణంలో..



కొండాపూర్: కొండాపూర్‌లోని రైతు వేదిక వద్ద..

రుణమాఫీపై హర్షం

రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జహీరాబాద్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని కొనియాడారు. సీఎం ప్రకటనతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

‘అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలి’

కొండాపూర్(సంగారెడ్డి): వికలాంగుల సంక్షేమ శాఖలో అవినీతికి పాల్పడుతున్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎన్పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి బసవరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వికలాంగుల సంక్షేమ శాఖలో జరుగుతున్న అవినీతికి సంబంధించి పలు ఆధారాలను జిల్లా సంక్షేమ అధికారి పద్మావతికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బుక్క ఇస్మాయిల్, నాయకులు పోచయ్య, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



గురుకుల సెక్రటరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన వినోద్‌ను గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చలపతి, రాష్ట్ర కార్యదర్శి వివేకానంద కలిసి శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరినట్టు సంఘం కార్యదర్శి వివేకానంద తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరి, ప్రమోద్, వెంకటేశ్వర్లు, భిక్షపతి, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారంలో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 8 మందికి ఒక్కొక్కరికీ రూ. 2 వేల చొప్పున జరిమాన విధించగా, ఒకరికి రూ. 3 వేలు, మరో ఇద్దరికి రూ. 5 వేల జరిమానా విధించినట్టు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



ఝరాసంగం: మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

నారాయణఖేడ్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని గ్రామపంచాయతీ కార్మికులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మొదట ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు చిరంజీవి ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ అధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మణ్, శ్రీను, తుకారాం, రాములు, సాయిలు, మొగులయ్య, పెంటమ్మ, సాయమ్మ పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

సదాశివపేట(సంగారెడ్డి): లేబర్ కోడ్లను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేయడం దారుణమని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నిధులు కేటాయించాలని వినతి

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని నవరత్నాల దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని మణికంఠ అయ్యప్ప ఉత్సవ కమిటీ గురుస్వాములు శుక్రవారం రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మురుగు కాలువ దేవాలయ వెనుక భాగం నుంచి కాకుండా వేరే మార్గం మీదుగా మళ్లించాలని కోరారు

జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారులతో రాజు తదితరులు

హత్నూర (సంగారెడ్డి): క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు, పీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులి మామిడి రాజు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలోని సంగారెడ్డి, హత్నూర, కంది తదితర మండలాలకు చెందిన పలువురు విద్యార్థులు కిక్ బాక్సింగ్, మార్షల్ ఆర్ట్స్‌లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆరుగురు క్రీడాకారులు ఖర్చుల నిమిత్తం రూ. 50,000 వేలు అందజేశారు.

ప్రపంచాన్ని అన్వేషించండి

పటాన్‌చెరు టౌన్: స్టార్టప్ నెలకొల్పాలనే ఉత్సాహం ఉన్న విద్యార్థుల ఆలోచనలో స్పష్టత ఉంటే పెట్టుబడి సేకరించడం పెద్ద కష్టమేమీ కాదని ఓయో చీఫ్ గ్రోత్ ఆఫీసర్ (సీజీవో) కవికృత్ అన్నారు. గీతం విశ్వవిద్యాలయం, రుద్రారం తొలి ఏడాది ప్రవేశం పొందిన విద్యార్థులతో శుక్రవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఆయా అంశాలను తమ అధ్యాపకులతో చర్చించి ప్రయోగాలు ప్రారంభించాలని సూచించారు. అలాగే తాము చేయాలనుకుంటున్న దానిని ఇతర వ్యాపార సంస్థలు ఎలా చేస్తున్నాయో కూడా అధ్యయనం చేయాలన్నారు. ఓయో ఆలోచనలకు సాంకేతిక నైపుణ్యాలను జోడించి వినియోగదారులను ఆకర్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్పీపీ) విజిటింగ్ ఫ్యాకల్టీ కవితాశర్మ, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

కంది(సంగారెడ్డి): కంది మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పనుల నిర్వహణపై ప్రజావేదిక నిర్వహించారు. 2021 ఆగస్టు 1 నుంచి 2023 మార్చి వరకు మండలంలోని గ్రామాల్లో పనులు చేపట్టి ఖర్చు చేసిన రూ. 3 కోట్ల 32 లక్షల నిధులపై రెండో విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పనులు చేసిన చోట బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, కూలీల హాజరులో వ్యత్యాసం, రికార్డుల్లో తప్పులు వంటి ఫిర్యాదులను విలేజ్ ఆడిటర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజావేదికలో డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు, ఏపీడీలు వామనరావు, జయదేవ్ ఆర్యా, స్టేట్ రిసోర్స్ పర్సన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సరళ పుల్లారెడ్డి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంపీఓ మహేందర్‌రెడ్డితో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సింధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధి బొంబాయి కాలనీలోని రైతు బజార్ నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు బజార్ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని మాక్స్ సొసైటీ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప నగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయిజ్యోతినగర్ కాలనీలో శుక్రవారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అశ్విన్ గౌడ్ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరామర్శ



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

పటాన్‌చెరు: విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణం అత్యంత బాధాకరమని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరులు కృష్ణారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సన్మానం



సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు

జిన్నారం/పటాన్‌చెరుటౌన్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సత్యనారాయణను ఎండీఆర్ ఫౌండేషన్ సలహాదారుడు పృథ్వీరాజ్, అధ్యక్షుడు మధు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బొల్లారం మున్సిపాలిటీకి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు రత్నం, బీరప్ప తదితరులు సత్యనారాయణను సత్కరించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుడు శ్రీపాల్‌రెడ్డి, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

‘నీటి సమస్యను పరిష్కరించండి’

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపాలిటీ పరిధి ఆరో వార్డులో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కౌన్సిలర్ సుజాత శుక్రవారం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. సమస్యను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నారాయణఖేడ్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని నారాయణఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ పిలుపునిచ్చారు. హరితహారంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూనగర్, మన్సూర్‌పూర్ తదితర కాలనీల్లో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. వివిధ రకాల పూల మొక్కలతో పాటు నీడ, అందాన్ని ఇచ్చే మొక్కలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించిన ఎస్పీ



మహేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డి అర్బన్: జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన మహేష్‌గౌడ్, మహిళా పోలీస్‌స్టేషన్ సంగారెడ్డికి బదిలీ కావడంతో ఆయనను ఎస్పీ రమణ కుమార్ శుక్రవారం సన్మానించారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించి అధికారుల మన్ననలు పొందాలని సూచించారు.

ఎన్నికల బరిలో ఏడు యూనియన్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ రామచంద్రాపురం యూనిట్‌లో ఈనెల 12వ తేదీన జరగనున్న కార్మిక సంఘం ఎన్నికల్లో 7 కార్మిక సంఘాలు పోటీ చేస్తున్నాయి. శుక్రవారం తొమ్మిది కార్మిక సంఘాలు నామినేషన్ దాఖలు చేయగా అందులో రెండు యూనియన్లు నామినేషన్ విత్ డ్రా చేసుకున్నాయి.

సంక్షిప్త వార్తలు

◆ శానిటేషన్‌పై శ్రద్ధ చూపండి

జహీరాబాద్: వర్షాకాలం కావడంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. శానిటేషన్‌పై శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ సుమతి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం అయ్యారు. ఈసందర్భంగా పలు సూచనలిచ్చారు.

◆ ఓటర్లకు అవగాహన

కల్హేర్(నారాయణఖేడ్): ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని కల్హేర్ డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ ఉమర్‌పాషా సూచించారు. శుక్రవారం కల్హేర్, మాసాన్‌పల్లి, దేవునిపల్లి, రాపర్తి, మీర్ఖాన్‌పేటలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రమోద్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

◆ తెల్లాపూర్‌లో..

రామచంద్రాపురం(పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ కాలనీ వాసులకు శుక్రవారం ఓటర్ నమోదుపై అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లలిత సోమిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్‌ఐ శ్రీకాంత్ , కౌన్సిలర్లు పాల్గొన్నారు.

◆ నివాళి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేసిన రిటైర్డ్ ప్రభుత్వ డ్రైవర్ బాణాపురం బాగయ్య (75) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డితో పాటు నివాళులర్పించారు.

◆ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

జిన్నారం(పటాన్‌చెరు): అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని దోమడుగులో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గొర్రెల పంపిణీని దశలవారీగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ బస్ పాస్‌ల అందజేత

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలం మోర్గి మోడల్ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు మార్కెటింగ్ ఇన్‌చార్జి పాండు శుక్రవారం బస్‌పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు నాగరాజు, సురేశ్, విఠల్, శేఖర్, ఆశన్న, గంగారాం, పిట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

◆ ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో శుక్రవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త ఓట్లను నమోదు చేసుకునేందుకు యువతీ, యువకులు ముందుకురావాలని సూచించారు.

◆ బీజేపీకి చెంపపెట్టు

పటాన్‌చెరుటౌన్: రాహుల్‌గాంధీపై అనర్హత, కుట్ర కేసులో సుప్రీంకోర్టు స్టే విధించడం బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు అని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ఇంకా బతికే ఉందని అనడానికి ఇదే నిదర్శనం అన్నారు.

◆ డిజిటల్ తరగతులు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులను శుక్రవారం ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశంగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

◆ చెక్కుల పంపిణీ

పటాన్‌చెరు: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 21 మందికి మంజూరైన చెక్కులను మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

◆ పీసీబీ అధికారులకు ఫిర్యాదు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు రసాయన పరిశ్రమల నుంచి భారీ మొత్తంలో కాలుష్య జలాలు విడుదలవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం నాయకులు, ప్రజాప్రతినిధులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ గాయాలతో మహిళ.. ఆస్పత్రికి తరలింపు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఓ మహిళ తీవ్ర గాయాలతో పడి ఉండగా.. గమనించిన సామాజిక సంఘ కార్యకర్త శారద బొల్లారంలోని ప్రభుత్వ ఆసుపత్రికి సమాచారం అందించారు. వైద్యురాలు రాధిక మహిళకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని కొత్తపల్లికి చెందిన పుట్ల ఎల్లమ్మగా పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

◆ దళితబంధు కేటాయించాలని నిరసన

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతి ఒక్క దళితునికి దళిత బంధు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ దోమడుగు లో శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు.

◆ 44 మందికి బీసీ బంధు

కంగ్టి(నారాయణఖేడ్): బీసీ బంధు పథకంలో భాగంగా 44 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ ముజఫరొద్దీన్ తెలిపారు. ఈసందర్భంగా అయా కులవృత్తుల వారు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

◆ గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: కుళ్లిన స్థితిలో ఉన్న ఓ మహిళ మృతిదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం..మండలంలోని పాటీ గ్రామ శివారులో కుళ్లిన స్థితిలో గుర్తుతెలియని మహిళ (35) మృతదేహం గురువారం లభ్యం కాగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పోలీసులు ఘటన స్థలానికి వైద్యులను పిలిపించి గుర్తుతెలియని మహిళ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సమీపంలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.